సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 14 । జూన్ । 2024



ప్రాణం పోస్తున్నారు..
ఓ స్వచ్ఛంద సంస్థ సభ్యులు అత్యవసర సమయాల్లో రక్తదానం చేస్తున్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పలువురు సభ్యుల అభిప్రాయాలతో కథనం.. 8లో▸



పొగాకు ఉత్పత్తుల పట్టివేత
జిల్లా కేంద్రంలో రూ.3.15లక్షల విలువైన నిషేధిత పొగాకు ఉత్పత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ముగ్గురిలో ఒకరిని అరెస్ట్ చేశారు. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.0 /27.0
ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణం చల్లబడుతుంది. అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

తెలుగు పాఠ్యపుస్తకాలు వెనక్కి తీసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: తెలుగు పాఠ్యపుస్తకాలను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో విద్యాశాఖ అధికారులు తెలుగు పాఠ్యపుస్తకాలను ఎమ్మార్సీకి పంపించాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. గురువారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేసిన ఒకటి నుంచి పది వరకు అన్ని తరగతుల తెలుగు పాఠ్యపుస్తకాలను వెనక్కి తీసుకున్నారు. పుస్తకంలోని ముందుమాటలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, అప్పటి ఉన్నతాధికారుల సందేశాలుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. తిరిగి కొత్త పుస్తకాలు ముద్రించి పంపుతారా.. లేదా ముందుమాటను తొలగించి అవే పుస్తకాల్లో మరో పేజీని అతికించి అందజేస్తారా.. అనేదానిపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే పంపిణీ చేసినా, చేయని పాఠ్యపుస్తకాలు వెనక్కి తీసుకుంటున్నట్లు డీఈవో ప్రణీత, ఎంఈవోలు, హెచ్‌ఎంలు చెబుతున్నారు.

లాసెట్ ఫలితాలు విడుదల

ఆదిలాబాద్‌టౌన్: లాసెట్ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. జిల్లాలో 219 మంది అభ్యర్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. 178 పరీక్షకు హాజరు కాగా, 41 మంది గైర్హాజరయ్యారు. జిల్లాకు చెందిన 135 (75.84%) మంది అర్హత సాధించారు.

‘ఓపెన్ స్కూల్’ ఫలితాలు విడుదల

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఏప్రిల్ 25నుంచి మే 2వరకు ఈ పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో పదో తరగతిలో 746 మంది పరీక్షలకు హాజరు కాగా 313 మంది ఉత్తీర్ణులయ్యారు. 433 మంది ఫెయిలయ్యారు. ఇంటర్మీడియట్‌లో 433 మంది పరీక్షలు రాయగా 243 మంది పాసయ్యారు. 190 మంది ఫెయిలైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత తెలిపారు. పదో తరగతి పేపర్‌కు రీకౌంటింగ్ కోసం రూ.350, రీ వెరిఫికేషన్ కోసం రూ.1,200, ఇంటర్మీడియట్ పేపర్ రీ కౌంటింగ్ కోసం రూ.400, రీ వెరిఫికేషన్ కోసం రూ.1,200 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెల 18నుంచి 27వ తేదీ వరకు మీ సేవ కేంద్రాల్లో ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లాలోని అధ్యయన కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

నూతన కార్యవర్గం



నియామకపత్రం అందజేస్తున్న అనిత

కైలాస్‌నగర్: మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు గురువారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో నిర్వహించారు. అధ్యక్షురాలిగా బొంపల్లి కృష్ణవేణి, ఉపాధ్యక్షురాలిగా చిట్ల పోసాని, ప్రధాన కార్యదర్శిగా ఎల్లుల కవిత, డైరెక్టర్లుగా చిట్ల రూప, తొకల రుక్మాబాయి, బట్టు లక్ష్మి, గుమ్ముల చిట్టెమ్మ, బొంపల లక్ష్మి, పల్లికొండ ఆమని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా సహకార శాఖ అధికారి అనిత ఎన్నికలాధికారిగా వ్యవహరించారు. నూతన కార్యవర్గానికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి భూమన్న, ప్రధాన కార్యదర్శి మేకల అశోక్, ఉపాధ్యక్షులు ఎల్లుల భోజన్న, ఎల్పుల సునీల్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

సార్లొస్తలేరు..!



- సెలవులో ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు
- అనారోగ్యమే కారణమని ప్రచారం
- ఏకకాలంలో లీవ్‌పై అనుమానాలు
- అక్రమ రిజిస్ట్రేషన్ల ఒత్తిడే కారణమా?
- ఎస్‌ఏ కవితకు ఇన్‌చార్జి బాధ్యతలు
- మందకొడి రిజిస్ట్రేషన్లతో వివాదం



ఆదిలాబాద్ ఎస్సార్వో కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఇన్‌చార్జి కవిత

సాక్షి, ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రిజిస్ట్రేషన్ల శాఖలో మంచిర్యాల తర్వాత అత్యధికంగా ఆదాయాన్నిచ్చే ఆదిలాబాద్ ఎస్సార్వో (సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్) కార్యాలయంలో విచిత్ర ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ కార్యాలయంలో జాయింట్–1, జాయింట్–2 ఎస్సార్వో పోస్టులు ఉండగా ఇద్దరూ విధులకు రాకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరువురు అధికారికంగా సెలవు తీసుకున్నప్పటికీ ఏకకాలంలో ఇలా ఎగనామం పెట్టడం చర్చకు దారి తీసింది. ప్రధానంగా ఆదిలాబాద్ శివారులోని అనేక కొత్త లేఅవుట్లకు సంబంధించి అనుమతులు లేకపోయినప్పటికీ వాటిని రిజిస్ట్రేషన్ చేయాలని పలువురు ఒత్తిడి తీసుకురావడంతోనే అధికారులు ఇలా సెలవులో వెళ్లారనే ప్రచారం సర్వత్రా వినిపిస్తోంది.

సీనియర్ అసిస్టెంట్‌కు బాధ్యతలు

ఆదిలాబాద్‌లో జాయింట్–1, జాయింట్–2 సబ్ రిజిస్ట్రార్లుగా విజయ్‌కాంత్, అశోక్ వ్యవహరిస్తున్నారు. అశోక్ కొద్దిరోజులుగా సెలవులో ఉన్నారు. విజయ్‌కాంత్ బుధవారం నుంచి లీవ్ పెట్టేశారు. ఇద్దరూ అనారోగ్య కారణాలతో తాము అందుబాటులో ఉండటం లేదని పైఅధికారికి సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఈ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా వ్యవహరించే కవిత బుధవారం నుంచి ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే చిన్నపాటి కారణాలున్నా రిజిస్ట్రేషన్ చేయడంలేదంటూ పలువురు ఆమెతో వాగ్వాదానికి దిగడంతో కార్యాలయంలో జరుగుతున్న వ్యవహారం బయటకు వచ్చింది.

అనుమతి లేని వెంచర్లకు రిజిస్ట్రేషన్లు!

ఆదిలాబాద్‌లో కొంతకాలంగా ఇలా అనుమతిలేని వెంచర్లకు సంబంధించి రిజిస్ట్రేషన్లు చేయడం పరిపాటిగా మారిందనే ప్రచారం సాగుతోంది. అంతేకాకుండా ప్రభుత్వ అసైన్డ్ భూములను అక్రమ పద్ధతుల్లో లేఅవుట్‌లు చేసినవాటిలో కూడా రిజిస్ట్రేషన్లు ఇటీవలి కాలంలో విరివిగా జరిగాయనే ప్రచారం ఉంది. దీంతో కొత్త లేఅవుట్లలోనూ ఇలాగే రిజిస్ట్రేషన్లు చేయాలని కొంతమంది తీవ్రంగా అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు మార్కెట్‌లో ప్రచారం జరుగుతోంది. దీంతో ఏవైనా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయేమోనని.. దీంతోనే ఇద్దరు అధికారులు ఇలా ఏకకాలంలో సెలవులో వెళ్లారని చెప్పుకొంటున్నారు. ఈ విషయంలో జిల్లా రిజిస్ట్రార్ ఫణిందర్‌ను వివరణ కోరేందుకు ఆఫీస్‌లో ప్రయత్నించగా.. ఆయన స్థానికంగా లేరని సిబ్బంది పేర్కొన్నారు. మొబైల్ ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ఒత్తిడే కారణమని ప్రచారం

ఆదిలాబాద్ పట్టణానికి శివారులో బట్టిసావర్గాం, మావలలోని పలు సర్వేనంబర్లలో కొత్త లేఅవుట్‌లు రూపుదిద్దుకున్నాయనే ప్రచారం జరుగుతోంది. డీటీసీపీ నుంచి వీటికి అనుమతి లభించకపోవడం, అంతేకాకుండా ఆ వెంచర్ భూములకు సంబంధించి సరైన లింక్ పత్రాలు లేకపోవడంతో రిజిస్ట్రేషన్ల విషయంలో అభ్యంతరం వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ లేఅవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఇటు రాజకీయంగా, అటు జనాల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో అధికారులు ఇలా ఏకకాలంలో సెలవులో వెళ్లారనే ప్రచారం జరుగుతోంది.



ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఇన్‌చార్జిగా ఉన్న అధికారిణి రిస్క్ తీసుకోకుండా అన్ని పత్రాలు సరిగా ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పడంతో బుధవారం కార్యాలయంలో ఈ విషయంలోనే వివాదం తలెత్తినట్లు తెలుస్తోంది.

జిల్లాలో 478 మందికి ప్రమోషన్



అభ్యంతరాలను సవరిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

- ముగిసిన అభ్యంతరాల స్వీకరణ
- ఖాళీలను గుర్తించడంలో జాప్యం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఎస్జీటీ క్యాడర్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు లభించనున్నాయి. గురువారం ప్రక్రియకు సంబంధించి ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. సీనియార్టీ జాబితాల్లో తప్పులు దొర్లడంతో వాటి సవరణ ప్రక్రియ ఆలస్యమైంది. అయితే గురువారమే సీనియార్టీ జాబితా ప్రకటించాల్సి ఉండగా తప్పుల సవరణ ప్రక్రియ రాత్రి వరకు కొనసాగడంతో ఆ జాబితా విడుదల కాలేదు. దీంతో ఉపాధ్యాయులు నిరుత్సాహానికి గురయ్యారు. ఇతర జిల్లాల్లో ప్రమోషన్లకు సంబంధించి వెబ్ ఆప్షన్లు ఇవ్వగా జిల్లాలో మాత్రం రాత్రి వరకు ఈ ప్రక్రియ ప్రారంభమే కాలేదు. జిల్లాలోని ఖాళీలను గుర్తించడంలో విద్యాశాఖ అధికారులు తీవ్ర తాత్సారం చేస్తున్నారు. కాగా, జిల్లాలో 478 ఖాళీలున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఇందులో 261 ఎస్జీటీ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు దక్కనుండగా, 217 మంది భాషాపండితులు, పీఈటీలకు ఉద్యోగోన్నతులు లభించనున్నట్లు సమాచారం. శుక్రవారం ప్రమోషన్ల కోసం ఎస్జీటీలు, భాషాపండితులు, పీఈటీలు వెబ్ ఆప్షన్లు ఇచ్చేందుకు అవకాశముంది. శనివారం ప్రమోషన్లకు సంబంధించి ఉత్తర్వులు వెలువడే అవకాశమున్నట్లు అధికారులు చెబుతున్నారు.

మూడునెలల్లో లక్ష్యాలు పూర్తి చేయాలి

కైలాస్‌నగర్: నీతి ఆయోగ్ నిర్దేశిత లక్ష్యాలను మూడు నెలల్లోగా పూర్తి చేయాలని ఆ సంస్థ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. గురువారం ఢిల్లీ నుంచి జిల్లాలు, బ్లాకుల కార్యక్రమంపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. నార్నూర్ మండలంలో గర్భిణుల ఏఎన్‌సీ చెకప్ వివరాలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షల నిర్వహణ, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం సరఫరా, భూసార పరీక్షల నిర్వహణ, కార్డుల జారీ, శాంపిళ్ల సేకరణ, స్వయం సహాయక సంఘాల రుణాల వివరాలు పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ఈ లక్ష్యాలను సాధించేందుకు గాను సంబంధిత శాఖల అధికారులు జూలై ఒకటి నుంచి సెప్టెంబర్ 30వరకు మూడు నెలలకు ప్రణాళికలను సిద్ధం చేసి కలెక్టర్‌కు అందజేయాలని తెలిపారు. ఈ నివేదికల ప్రకారం కలెక్టర్ సమీక్షిస్తూ లక్ష్యాలను సాధించేలా పర్యవేక్షించాలని సూచించారు. ఏబీపీ ఇండికేటర్స్ తాజా ప్రగతి, బీడీఎస్ ప్రగతి డాక్యుమెంట్లను ఈ నెల 20వ తేదీలోపు నీతి ఆయోగ్‌కు పంపించాలని ఆదేశించారు. వోకల్ ఫర్ లోకల్‌లో భాగంగా అక్కడి ఉత్పత్తులను గుర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా స్థానికంగా చేపట్టిన చర్యలను ఆయనకు వివరించారు.

సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు

కైలాస్‌నగర్: వానాకాలంలో సీజనల్ వ్యాధుల ప్రబలకుండా గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని వైద్యాధికారులతో సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందస్తుగా శిథిలమైన, కూలిపోయే స్థితిలో ఉన్న భవనాలను గుర్తించి వెంటనే కూల్చివేయాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల నివాస గృహాలు మునిగిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పారిశుధ్య నిర్వహణ పనులు సక్రమంగా చేపట్టి డెంగీ, మలేరియా, చికెన్ గున్యా లాంటి వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రైబల్ స్కూళ్లు, కేజీబీవీలను నిత్యం సందర్శించి విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని పేర్కొన్నారు. మంగ, శుక్రవారాల్లో డ్రై డే పాటించాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి నరేందర్, ప్రోగ్రాం అధికారులు, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

తాంసి: సహకార సంఘాల ద్వారా తక్కువ వడ్డీతో అందిస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఈవో కేశవ్ సభ్యులకు సంఘం ఆదాయ, వ్యయ, పొదుపు, అప్పుల నివేదిక చదివి వినిపించారు. ఈ సందర్భంగా బోజారెడ్డి మాట్లాడుతూ.. సహకార సంఘాల ద్వారా పంటలు కొనుగోలు చేస్తూ, ఎరువులు విక్రయిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. సంఘం సభ్యుల కృషితో సొసైటీ ఉత్తమ స్థానంలో ఉందని పేర్కొన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ ధనుంజయ్, సీఈవో కేశవ్, డైరెక్టర్లు సామ కవిత, అశోక్‌రెడ్డి, బుజ్జన్న, చంద్రన్న, యాదవ్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భోజారెడ్డి

ఎన్‌ఎంఎంఎస్‌కు 58మంది ఎంపిక

ఆదిలాబాద్‌టౌన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) నకు జిల్లాకు చెందిన 58 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులు ఎంపికయ్యారు. ఇంటర్మీడియట్ వరకు వీరికి కేంద్ర ప్రభుత్వం ఏటా స్కాలర్‌షిప్ ఇవ్వనుంది. విద్యార్థుల ఎంపికపై డీఈవో, హెచ్‌ఎంలు హర్షం వ్యక్తం చేశారు.

బ్యాంక్ లింకేజీ రుణ లక్ష్యం రూ.274 కోట్లు

- ఇటీవల ఖరారు చేసిన ప్రభుత్వం
- మండలాల వారీగా కేటాయింపు
- లక్ష్యాన్ని సాధించేందుకు యత్నం

కైలాస్‌నగర్: జిల్లాలోని స్వయం సహాయక సంఘాల ఆర్థిక పరిపుష్టే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. సంఘాల్లోని మహిళా సభ్యులు స్వయం ఉపాధితో పాటు చిన్నతరహా పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, టైలరింగ్ తదితర యూనిట్ల స్థాపనతో ఆర్థికంగా ముందుడుగు వేసేదిశగా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగానే 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను బ్యాంక్ లింకేజీ రుణ లక్ష్యాలను ప్రభుత్వం ఇటీవల ఖరారు చేసింది. ఈ ఏడాదిలో జిల్లాలోని 17 మండలాల్లోని 8,993 స్వయం సహాయక సంఘాలకు గాను రూ.274.04కోట్లు బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్ణయించింది. జిల్లాకు నిర్దేశించిన రుణ లక్ష్యాన్ని మండలాల వారీగా కేటాయించిన అధికారులు లక్ష్యసాధన దిశగా దృష్టి సారిస్తున్నారు. నెలవారీగా టార్గెట్లను ఖరారు చేసి వాటిని సాధించేలా ఐకేపీ అధికారులు, ఉద్యోగులకు దిశానిర్దేశం చేస్తున్నారు.

గతేడాది కంటే రూ.50కోట్లు పెంపు

2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలో బ్యాంక్ లింకేజీ కింద రూ.220 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వందశాతం లక్ష్యాన్ని సాధించారు. మండల, జిల్లా అధికారులు బ్యాంకర్ల సమన్వయంతో మండలాల వారీగా స్వయం సహాయక సంఘాలకు కేటాయించిన లక్ష్యాలను సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించారు. పలువురు మహిళలు ఈ రుణాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తున్నారు. కాగా, ప్రభుత్వం గతేడాది కంటే ఈ ఏడాది రూ.50కోట్లను అదనంగా పెంచింది.




జూన్ లక్ష్యం రూ.44 కోట్లు


నిర్దేశిత లక్ష్యాలను వందశాతం సాధించేలా జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి సారించారు. ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. ఇందుకోసం నెలవారీ లక్ష్యాలను కేటాయిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 17 మండలాల్లోని 2,128 సంఘాలకు గాను రూ.44.34కోట్ల రుణాలను బ్యాంకు లింకేజీ ద్వారా జూన్‌లో అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఇప్పటివరకు 351 సంఘాలకు గాను రూ.24.45కోట్ల రుణాలు అందించారు. ఇంకా ఈనెలలో 1,777 సంఘాలకు రూ.19.89కోట్లు అందించాల్సి ఉంది. అయితే 17 రోజుల సమయం ఉన్నందున నెలవారీ లక్ష్యాన్ని వందశాతం సాధిస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. బ్యాంక్ రుణాలు పొందిన మహిళలు వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ప్రగతి సాధించాలని అధికారులు సూచిస్తున్నారు.

మండలం	ఎస్‌హెచ్‌జీలు	రుణ లక్ష్యం (రూ.కోట్లలో)
తాంసి	295	రూ.11.90
మావల	100	రూ.4.18
ఇంద్రవెల్లి	532	రూ.13.08
బేల	566	రూ.16.53
బోథ్	689	రూ.24.16
తలమడుగు	681	రూ.21.76
ఆదిలాబాద్‌రూరల్	566	రూ.18.17
నేరడిగొండ	585	రూ.16.20
గాదిగూడ	311	రూ.5.72
జైనథ్	866	రూ.28.46
బజార్‌హత్నూర్	564	రూ.16.95
నార్నూర్	498	రూ.11.17
ఉట్నూర్	503	రూ.16.71
గుడిహత్నూర్	561	రూ.17.39
సిరికొండ	255	రూ.7.22
భీంపూర్	336	రూ.9.01
శ్యాంపూర్	467	రూ.14.45
ఇచ్చోడ	618	రూ.20.91


కురిసిన వర్షం.. అన్నదాతల హర్షం



ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం



బోథ్: మండల కేంద్రంలో..



ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో..

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ఆదిలాబాద్, మావల, బోథ్, తాంసి, భీంపూర్, నార్నూర్, గాదిగూడ, బేల తదితర మండలాల్లో గురువారం సాయంత్రం చిరుజల్లుల నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. ఇన్నిరోజులపాటు ఉక్కపోతతో సతమతమైన జనాలకు ఉపశమనం లభించింది. వారం గడిచినా చినుకు జాడ లేక ఆందోళనకు గురవుతున్న అన్నదాతలకు ఊరటనిచ్చింది. కాగా, పలుచోట్ల విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

బోథ్ మండలంలో..

బోథ్: మండల వ్యాప్తంగా గురువారం సాయంత్రం దాదాపు రెండుగంటల పాటు ఏకధాటిగా ఈదురు గాలులతో వర్షం కురిసింది. విత్తనాలు వేసి వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు పెద్ద ఊరట లభించింది. ఒకవైపు తీవ్ర ఉక్కపోతకు గురైన ప్రజలకు ఈ వర్షం ఉపశమనాన్ని కలిగించింది.

ఇంద్రవెల్లి మండలంలో..

ఇంద్రవెల్లి: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఇన్కార్‌గూడ, ముత్నూర్, దనోర గ్రామాల సమీపాల్లోని ప్రధాన రహదారులపై చెట్లు విరిగిపడ్డాయి. వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. కాగా, ముందస్తుగా పత్తి విత్తనాలు వేసిన రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

కలెక్టరేట్ ఎదుట ఆశ కార్యకర్తల ధర్నా

కైలాస్‌నగర్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ఆశ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ముందుగా స్థానిక సుందరయ్యభవనం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్ మాట్లాడారు. అన్ని విధులు నిర్వహిస్తూ సీనియార్టీ కలిగిన ఆశ కార్యకర్తలకు కొత్తగా పరీక్ష నిర్వహించి వారి జ్ఞాపకశక్తిని నిరూపించుకోవాలనే ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పనిభారం తగ్గించాలని, జాబ్ కార్డులు అందించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని కోరారు. పెన్షన్, రూ.50లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రతినెలా 2వ తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నైతం శోభ, గంగమ్మ, ఆశ, అర్చన, లక్ష్మి, కాంత, పుష్పలత, రుక్మిణి, పుష్ప, సురేఖ, లక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

క్లుప్తంగా

హనుమాన్ ఆలయంలో చోరీ

భైంసాటౌన్: పట్టణ శివారులోని మిషన్ భగీరథ గ్రిడ్ సమీపంలోని ఏకముఖి హనుమాన్ ఆలయంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయంలో చొరబడిన దొంగలు హుండీ పగులగొట్టి సొత్తు ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఆలయానికి వచ్చిన అర్చకుడు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఆలయ కమిటీ సభ్యుడు అవినాష్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ డి.రాజారెడ్డి తెలిపారు.

ఎస్సైపై సస్పెన్షన్ వేటు

నిర్మల్‌టౌన్: వెహికిల్ ఇన్సూరెన్స్ కేసు దర్యాప్తులో అవకతవకలకు పాల్పడి వాహన యజమానికి లబ్ధి చేకూర్చేలా యత్నించిన నిర్మల్ రూరల్(ప్రస్తుతం నిర్మల్ టౌన్) ఎస్సై కె.చంద్రమోహన్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్–1 ఐజీ రంగనాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫిబ్రవరి 2న ద్విచక్ర వాహనదారులు కారును ఢీకొట్టిన ఘటనలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన కారు ఇన్సూరెన్స్ గడువు ముగియడంతో యజమాని ఫిబ్రవరి 3న ఇన్సూరెన్స్ రెన్యూవల్ చేయించాడు. ప్రమాదానికి గురైన కారుకు ఇన్సూరెన్స్ వర్తించేలా ఎస్సై చంద్రమోహన్ వాస్తవాలను దాచి ప్రమాదం 6వ తేదీన జరిగినట్లు చిత్రీకరించాడు. ఫిబ్రవరి 13న కారు యజమానికి లబ్ధిచేకురేలా ద్విచక్రవాహనదారుడిపై కేసు నమోదు చేశాడు. దీనిపై ఎస్పీ జానకీ షర్మిల ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎస్సైని సస్పెండ్ చేస్తూ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

మృతదేహాన్ని త్వరగా తెప్పించండి

ఖానాపూర్: దుబాయ్‌లో ఆత్మహత్య చేసుకున్న పాత ఎల్లాపూర్‌కు చెందిన గల్ఫ్ కార్మికుడు కుంచపు గంగారాం మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తెప్పించాలని బాధిత కుటుంబీకులు కోరారు. ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ నాయకులు స్వదేశ్ పరికిపండ్లను జిల్లా కేంద్రంలో గురువారం కలిసి విన్నవించారు. ఈ మేరకు సంబంధిత వివరాలతో కూడిన అఫిడవిట్ పూర్తిచేసి సెక్రెటేరియట్‌లోని సాధారణ పరిపాలన విభాగ అధికారులకు మెయిల్ పంపినట్లు స్వదేశ్ పరికిపండ్ల తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌నగర్ ప్రాంతంలోగల మమత జిన్నింగ్ మిల్ వద్ద రోడ్డు పక్కన గురువారం గాయాలతో గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించింది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు పంపించారు. మృతురాలి వయస్సు సుమారు 30 ఏళ్లు ఉంటుంది. మృతురాలి ఒంటిపై గులాబీ రంగు చీర, జాకెట్ ఉంది. మహిళను ఎక్కడో చంపి ఇక్కడ పడేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. మహిళ ముఖం, ఒంటిపై గాయాలున్నాయి. ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి సంబంధీకులు 8712659914 నంబర్‌లో లేదా టౌన్ సీఐ అశోక్‌ను 8712659920 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

భైంసాటౌన్: పట్టణంలోని నేతాజీనగర్‌కు చెందిన పి.మహేశ్(35) జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ డి.రాజారెడ్డి కథనం ప్రకారం.. మహేశ్‌కు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలుగలేదు. ఈ క్రమంలో మనస్తాపం చెంది బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారిళ్లలో గాలించారు. కాగా, గురువారం ఉదయం స్థానిక బైల్‌బజార్ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ప్రాణం పోస్తున్నారు..

- రక్తదానానికి ముందుకు వస్తున్న యువత
- భైంసాలో నాలుగు రక్తదాన బృందాలు


రక్తదానం చేస్తున్న యువకుడు

భైంసారూరల్: రక్తదానం.. ప్రాణాలను నిలబెడతుంది. ఇది గుర్తించిన భైంసా పట్టణ యువత స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు వస్తోంది. పట్టణంలో నాలుగు గ్రూపులు ఏర్పాటు చేసి వేర్వేరుగా రక్తదానం చేస్తున్నాయి. బ్లడ్ డోనర్స్ గ్రూప్, అయోధ్య సేవా సమితి, ఐక్యత సేవా సమితి, హమారా సహారా వెల్ఫేర్ సొసైటీ.. ఇలా నాలుగు గ్రూపులు రక్తం కావాలని అడిగిన వెంటనే స్వచ్ఛందంగా దానం చేస్తున్నాయి. నాలుగు గ్రూపుల్లో 1,500 మందికిపైగా సభ్యులు ఉన్నారు. చుట్టు పక్కల ఏ ప్రమాదం జరిగినా, శస్త్రచికిత్సల్లో రక్తం అవసరమైన క్షణాల్లోనే సమాచారం అందుకుని రక్తం అందించేందుకు ముందుకువస్తున్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇప్పటికే వేలాది మంది ప్రాణాలు నిలబెట్టిన దాతల అభిప్రాయం వారి మాటల్లో..



ఏ క్షణమైనా రెడీ



అయోధ్య సేవా సమితి తరపున రక్తదానం చేసేందుకు మా సభ్యులు రెడీగా ఉంటారు. మనకు తెలిసిన వారు చుట్టు పక్కల చికిత్సలు తీసుకుంటే అక్కడ కూడా వెళ్లి రక్తదానం చేసి వస్తున్నాం. రక్తదానం చేసే సమయంలో ఆ కుటుంబం పంచే ఆప్యాయత ఎక్కడ దొరకదు. కళ్లముందే తమవారు అల్లాడుతుంటే మేము వెళ్లి రక్తదానం చేస్తుంటాం. కోలుకున్నాక ఎక్కడైనా కనిపిస్తే వీళ్లతోనే బతికామంటూ గొప్పగా చెబుతుంటారు.

– యోగేశ్, అయోధ్య సేవా సమితి గ్రూపు నిర్వాహకుడు

ఏడుసార్లు రక్తదానం చేసిన



భైంసా ఆసుపత్రుల్లో అత్యవసరంగా రక్తం కావాలని తెలియగానే నేను రక్తదానం చేశాను. ఇప్పటికీ ఏడుసార్లు రక్తదానం చేశాను. రక్తం అవసరమని ఏ గ్రూపులో వచ్చినా నేను స్పందిస్తాను. నాతోపాటు ఉండే నా ఫ్రెండ్స్ కూడా ఉత్సాహంగా ముందుకు వస్తారు. రక్తదానం చేయాలని మేమంతా నిర్ణయించుకున్నాం. రక్తదానం చేయడం బాధ్యతగా తీసుకోవాలి. మనం చేసే రక్తదానం ఒకరి ప్రాణాలనే కాదు ఒక కుటుంబాన్నే నిలబెడుతుంది. – సాయి, భైంసా

సేవలు కొనసాగిస్తాం



బ్లడ్ డోనర్స్ గ్రూప్ ద్వారా అవసరం ఉన్న వారికి రక్తదానం చేస్తున్నాం. అత్యవసరంగా ఎవరు సమాచారం ఇచ్చిన మా తరఫున సేవలు చేస్తున్నాం. ఇప్పటికే వందలాది మందికి రక్తదానం చేశాం. రక్తం అవసరం ఉంటే గ్రూపులో పోస్టు చేయగానే యువకులు ముందుకువస్తున్నారు. ఈ సేవలు కొనసాగించేందుకు మా బృందంలో ఎంతో మంది యువకులు ముందుకు వస్తున్నారు.

– సురేశ్, బ్లడ్ డోనర్స్ గ్రూపు నిర్వాకుడు

సేవ చేసేందుకే..



ఎంతో మంది పేదలు రక్తం కోసం అల్లాడుతుంటారు. తమ వారిని ఆసుపత్రిలోచేర్పించి అవసరమైన రక్తం దొరకక ఇబ్బందులు పడుతుంటారు. అలాంటి సంఘటనలు చూసి భైంసాలో ఐక్యత సేవా సమితిని ఏర్పాటు చేశాం. స్నేహితులంతా కలిసి ఈ గ్రూప్‌ను ప్రారంభించాం. కరోనా సమయం నుంచి సేవలు అందిస్తున్నాం. రక్తదానం చేసేందుకు మా సభ్యులు అందుబాటులో ఉంటారు.

– యోగేశ్, ఐక్యత సేవా సమితి నిర్వాహకుడు

పేదల ప్రాణాలు నిలిపేందుకు..



నియోజకవర్గంలో ఎంతో మంది నిరుపేదలు ఉన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం దొరకక ఇబ్బందులు పడుతుంటారు. ఇలా చూసి ఒక గ్రూపు ఏర్పాటు చేయాలనుకున్నాం. సోషల్ మీడియా వేదికగా తెలిసినవారందరినీ గ్రూపులో చేర్పించాం. రక్తం అవసరం ఉంటే గ్రూపులో సమాచారం పోస్ట్‌చేస్తాం. సభ్యులు స్పందించి రక్తదానం చేసేందుకు ముందుకువస్తున్నారు. నిరుపేదలకు ఇలా సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాం.

– అయూబ్, హమారా సహారా వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకుడు

ఎక్సైజ్ దాడులు


తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కడెం: మండలంలోని నర్సాపూర్, నచ్చన్‌ఎల్లాపూర్, మాసాయిపేట్, మద్దిపడగ గ్రామల్లోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు గురువారం దాడులు చేశారు. ఈ దాడుల్లో పది లీటర్ల గుడుంబా, 200 లీటర్ల బెల్లం పానకం పారబోసినట్లు ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్ తెలిపారు. గతంలో వివిధ కేసుల్లో పట్టుబడిన పది మంది నిందితులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఇందులో ఎక్సైజ్ సిబ్బంది రషీద్, వెంకటేశ్, రవళి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబాతో పట్టుబడ్డ మహిళ

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో 5 లీటర్ల గుడుంబాతో మండలంలోని ఇక్బాల్‌పూర్‌కు చెందిన మహిళ బూక్య లక్ష్మి పట్టుబడినట్లు ఎక్సైజ్ ఎస్సై వసంత్‌రావు తెలిపారు. ఇదివరకు గుడుంబా విక్రయిస్తూ పట్టుబడ్డ ఇక్బాల్‌పూర్‌కు చెందిన సురేశ్‌తోపాటు లక్ష్మిని తహసీల్దార్ శివరాజ్ ముందు గురువారం బైండోవర్ చేసినట్లు తెలిపారు.



గుడుంబా విక్రేతలను బైండోవర్ చేస్తున్న అధికారులు

సాంఘిక బహిష్కరణపై ఆందోళన


కుభీర్‌లోని వివేకానంద చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న దళితులు

కుభీర్: మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో పార్డి(కె)గ్రామానికి చెందిన దళితులు తమను గ్రామస్తులు సాంఘిక బహిష్కరణ చేశారని గురువారం ఆందోళన చేశారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పార్డి(కె)గ్రామంలో రెండు నెలలుగా ఎస్సీలకు(అంబేద్కర్ సామాజికవర్గం)వారికి అంబేద్కర్ విగ్రహం వద్ద కట్టే ప్రహరీ విషయంలో వివాదం ఏర్పడింది. ఆ విగ్రహానికి కొంత దూరంలో ఒక చబుత్రపై మారెమ్మ చిన్నపాటి విగ్రహం ఉంది. ఇరువర్గాల వారు అధికారుల దృష్టికి తీసుకురాగా అధికారులు పరిష్కారం కోసం చాలాసార్లు నచ్చజెప్పారు. ఈ విషయంలో గ్రామానికి చెందిన 10 మందిపై అట్రాసిటీ కేసునమోదు చేశారు. ఇటీవల డివిజన్‌స్థాయి అధికారులు గ్రామసభ ఏర్పాటు చేసి ఇరువర్గాలకు నచ్చజెప్పారు. తమకు మందిరంలో పెళ్లి చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలన్నారు. దానికి గ్రామస్తులు పూజలు గాని పెళ్లి గాని హిందూ ధర్మం ప్రకారం చేసుకోవాలని తెలిపారు. తాము బౌద్ధ ధర్మం ప్రకారం చేసుకుంటామంటే గ్రామస్తులు ఒప్పుకోలేదు. దీంతో చేసేదిలేక అధికారులు వెళ్లిపోయారు. అప్పటి నుంచి గ్రామస్తులు తమతో మాట్లాడడం, పనులకు పిలవడం లేదని తెలిపారు. సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ ఎం.సోము, ఎస్సై పి.రవీందర్ నిరసనకారులతో మాట్లాడారు. నీటి, కరెంట్ సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

పొగాకు ఉత్పత్తుల పట్టివేత


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి


ఆదిలాబాద్‌రూరల్: రూ.3,15,150 విలువైన నిషేధిత పొగాకు ఉత్పత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం మావల పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ జీవన్‌రెడ్డి వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని రిక్షా కాలనీకి చెందిన షేక్ అఫ్సర్ పట్టణంలోని భుక్తపూర్ కాలనీకి చెందిన అక్రం, మన్సూర్ వద్ద నిషేధిత పొగాకు ఉత్పత్తులు కొనుగోలు చేశాడు. మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదర్శనగర్ కాలనీలోగల ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు తీసుకున్న గదిలో నిల్వ చేశాడు. ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుందామని ప్లాన్ వేశాడు. కానీ.. ఇంతలోనే సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం రాత్రి గదిలో నిల్వ చేసిన నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. అఫ్సర్‌ను అరెస్ట్ చేయగా, అక్రం, మన్సూర్ పరారీలో ఉన్నారు. ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే సమాచారం ఇచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిదర్, మావల ఎస్సై విష్ణువర్ధన్, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయుడి హత్య కేసు విచారణ వేగవంతం

- సీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు
- పోలీసుల అదుపులో మృతుడి భార్య

నార్నూర్: గాదిగూడ మండలం అర్జుని కొలాంగూడ శివారులో బుధవారం ఉదయం హత్యకు గురైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాదవ్ గజానంద్ (40) కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ పర్యవేక్షణలో సీఐ రహీంపాషా ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు కొనసాగుతోంది. బుధవారం హత్య జరిగిన స్థలంలో డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించి విచారణ చేపట్టారు. స్వయంగా డీఎస్పీ హత్యకు గల కారణాలపై కుటుంబ సభ్యులను విచారించారు. తన కొడుకు మృతిపై అనుమానం ఉందని మృతుడి తండ్రి జాదవ్ బిక్కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అదేరోజు రాత్రి 11గంటలకు అంత్యక్రియలు పూర్తి కాగా, 12 గంటల ప్రాంతంలో మృతుడి భార్య విజయలక్ష్మిని పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఆమెను విచారిస్తున్నట్లు సమాచారం. కాగా, ప్రభుత్వ ఉపాధ్యాయుడు హత్య కేసును పోలీసులు చాలెంజ్‌గా తీసుకుని విచారణను వేగవంతం చేశారు. త్వరలో నిందితులను పట్టుకుంటామని సీఐ రహీంపాషా తెలిపారు.

బతుకుదెరువు కోసం వచ్చి పిడుగుపాటుకు బలి


జాదవ్‌రామ్ మృతదేహం

తానూరు: బతుకుదెరువు కోసం మహారాష్ట్ర నుంచి పదేళ్ల క్రితం వచ్చిన ఓ వ్యక్తి నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఎల్వత్ గ్రామంలో ఓ రైతువద్ద పాలేరుగా పనిచేస్తున్నాడు. గురువారం వ్యవసాయ పనులు ముగించుకుని వస్తుండగా పిడగుపాటుతో మృతిచెందాడు. ఏఎస్సై శామ్యుల్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని భోకర్ తాలూక పాకి గ్రామానికి చెందిన జాదవ్‌రామ్(45) పదేళ్ల క్రితం ఎల్విత్ గ్రామానికి వచ్చాడు. పాలేరుగా పనిచేస్తున్నాడు.రోజు మాదిరిగానే గురువారం వ్యవసాయ పనులకు వెళ్లాడు. సాయంత్రం ఎడ్లబండిపై ఇంటికి తిరిగి వస్తున్న క్రమంతో ఉరుములు, మేరుపులతో కుడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగు పడడంతో ఎడ్లబండిపై నుంచి కిందపడి మృతిచెందాడు. రాదవ్ రామ్ భార్య రుణుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగ్గురి ఊపిరి తీసిన ప్రహరీ


శంకర్ మృతదేహాన్ని వెలికితీస్తున్న తోటి కూలీలు


పోషం మృతదేహాన్ని వెలికితీస్తున్న స్థానికులు


హన్మంత్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- గోడ కూలి కూలీల మృత్యువాత
- జేసీబీతో రెండు గంటలు శ్రమించి మృతదేహాల వెలికితీత
- ఘటన స్థలాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్, సీపీ
- న్యాయం చేయాలని కార్మిక సంఘాల డిమాండ్
- భవన నిర్మాణ అనుమతి రద్దుకు అదనపు కలెక్టర్ ఆదేశాలు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం/చింతలమానెపల్లి: బతుకుదెరువు కోసం వలస వచ్చిన ముగ్గురు కూలీల ప్రాణాలు మట్టిలో కలిశాయి. పనులు చేస్తుండగా ఒక్కసారిగా ప్రహరీ కూలి మీద పడడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మరొకరు గాయాలతో బయటపడ్డారు. పోలీసులు, స్థానికులు రెండు గంటలపాటు శ్రమించి జేసీబీ, డ్రిల్లర్ సాయంతో మృతదేహాలను వెలికితీశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకున్న ఈ ఘటన మూడు కుటుంబాల్లో విషాదం మిగిల్చింది. మంచిర్యాల పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తా సమీపంలో నందిని ఆస్పత్రి వైద్యురాలికి చెందిన నూతన భవన నిర్మాణ పనులకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి మండలం రుద్రాపూర్ గ్రామానికి చెందిన ఏనంక హన్మంత్(35), బాబాపూర్‌కు చెందిన ఆత్రం శంకర్(40), చింతలమానెపల్లికి చెందిన గోలెం పోషం(50), కొటాల మండలం గుడ్లబోరి గ్రామానికి చెందిన మైదం రాములు, మరో ఇద్దరు కూలీలు వెళ్లారు. పిల్లర్ల మధ్యలో మట్టి, బండలు నింపుతుండగా సెల్లార్‌కు పక్కనే ఇతరులకు చెందిన శిథిలావస్థలో ఉన్న ప్రహరీ కూలి పోషం, శంకర్, హన్మంత్‌లపై పడడంతో దాని కింద నలిగిపోయి ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందారు. రాములును మరో ఇద్దరు కూలీలు బయటకు లాగడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. మృతదేహాలపై పూర్తిగా మట్టి కూరుకుపోవడంతో స్థానిక సీఐ బన్సిలాల్, సిబ్బందితోపాటు జేసీబీ సహాయంతో రెండు గంటలపాటు శ్రమించి బయటకు తీశారు. ఘటన స్థలంలో మృతుల కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. ఘటన స్థలాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాసులు పరిశీలించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఘటన స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, ఆర్డీవో రాములు, ఏసీపీ ప్రకాష్ పరిశీలించారు. భవన నిర్మాణ అనుమతి రద్దు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌ను ఆదేశించారు.

న్యాయం చేయాలని కార్మిక సంఘాల డిమాండ్

కార్మికులకు రక్షణ కరువైందని, మృతులు పోషం, హన్మంతు, శంకర్ కుటుంబాలకు న్యాయం చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. సెల్లార్ నిర్మాణానికి అనుమతులు లేవని ఆరోపించారు. భవనం యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, డిమాండ్ చేశారు.

త్వరలో బిడ్డ పెళ్లి.. అంతలోనే మృతి

చింతలమానెపల్లి మండలం రుద్రాపూర్ గ్రామానికి చెందిన ఏనంక హన్మంతు స్వగ్రామంలో కుమ్మరి పని చేసేవాడు. కులవృత్తిలో ఉపాధి లభించక కుటుంబంతో సహా మంచిర్యాల పట్టణంలో భార్య లక్ష్మి, కుమారుడు రాజేష్‌తో నివాసం ఉంటూ కూలీ పనులు చేస్తున్నాడు. పని చేస్తేనే వీరి పొట్ట గడిచే పరిస్థితి. స్వగ్రామం రుద్రాపూర్‌లో వృద్ధులైన తల్లిదండ్రులు మారయ్య, బాయక్క ఉన్నారు. ఇటీవల కూతురు శివానికి పెళ్లి కుదిరింది. త్వరలో పెళ్లి చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇంతలోనే కుటుంబ పెద్ద హన్మంతు మృతితో విషాదం నెలకొంది.

కూలీకి వెళ్తేనే కడుపు నిండేది..

చింతలమానెపల్లికి చెందిన గోలెం పోషం కుటుంబానిది రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. బాబాసాగర్ గ్రామానికి చెందిన పోషం అక్కడి నుంచి చింతలమానెపల్లికి వలస వచ్చాడు. ఆర్థికంగా నష్టాలు రావడంతో అప్పుల పాలయ్యాడు. భార్య గంగతో కలిసి కూలీ పనులు చేసేందుకు మంచిర్యాలకు వచ్చాడు. కుమారుడు శేఖర్ హైదరాబాద్‌లో పని చేస్తూ చదువుకుంటున్నాడు. బుధవారం ఎల్లారంలో మొక్కులు తీర్చుకున్న పోషం భార్య గంగ, కుమారుడు శేఖర్ ఇంటికి వచ్చారు. పోషం మంచిర్యాలకు వెళ్లి గురువారం సాయంత్రం మృత్యువాత పడ్డాడు.

భూమి లేక వలస వచ్చి..

బాబాపూర్ గ్రామానికి చెందిన ఆత్రం శంకర్‌కు సోదరులు మల్లేష్, దుర్గాజీ ఉన్నారు. మల్లేష్ ఉపాధి కోసం మరో గ్రామానికి వెళ్లగా శంకర్, దుర్గాజీ గ్రామంలోనే నివాసం ఉండేవారు. జీవనం సాగించడానికి వీరి వద్ద ఉన్న భూమి సరిపోకపోవడంతో తమ్ముడు దుర్గాజీకి భూమి అప్పగించి భార్యాపిల్లలతో శంకర్ మందమర్రి మండల కేంద్రంలో ఉంటున్నాడు. మంచిర్యాలలో కూలీ పనికి వచ్చి వెళ్తుండేవాడు. భార్య ధనలక్ష్మి, ఇద్దరు కూతుళ్లు సిరివెన్నెల, హర్షితరాణిలతో నివాసం ఉంటున్నాడు. కూలీ డబ్బులతో పిల్లలను చదివిస్తున్నాడు.

ఇరువర్గాల మధ్య గొడవ

- పోలీస్‌స్టేషన్ ఎదుట ఉద్రిక్తత

ఇచ్చోడ: మండల కేంద్రంలో నిర్మల్ బైపాస్ వద్ద గురువారం సాయంత్రం పశువులు తరలిస్తున్న వాహనం ఆపిన విషయంలో రెండువర్గాల మధ్య గొడవ జరిగింది. అనుమతి లేకుండా పశువులను తీసుకెళ్లవద్దని ఒకవర్గం యువకులు పశువులు తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. ఒకవర్గం యువకులపై మరో వర్గం యువకులు దాడి చేశారనే విషయం బైటకు రావడంతో ఇరువర్గాల వారు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో కొద్దిసేపు పోలీస్‌స్టేషన్ ఎదుట ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆదిలాబాద్ నుంచి ప్రత్యేక పోలీసు బలగాలను పిలిపించి రెండువర్గాల వారిని అక్కడి నుంచి పంపించారు. ముందస్తుగా వ్యాపార సంస్థలను మూసివేయించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి కేసులు నమోదు చేయనున్నట్లు ఇచ్చోడ సీఐ భీమేశ్ తెలిపారు. సీఐ ఆధ్వర్యంలో ఇచ్చోడ, నేరడిగొండ, సిరికొండ, గుడిహత్నూర్ ఎస్సైలతోపాటు ప్రత్యేక పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.